సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం | 3 | డిసెంబర్ | 2024



గ్రీవెన్స్ డేకు 18 ఫిర్యాదులు

సిరిసిల్లక్రైం: బాధితులకు సత్వర సహాయం అందించేందుకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. సోమవారం వివిధ సమస్యలపై 18 మంది ఫిర్యాదు చేశారు.



కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిలో సోమవారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. 27 మందికి ఆపరేషన్లు చేసినట్లు సూపరింటెండెంట్ పెంచలయ్య తెలిపారు.

గరిష్టం/కనిష్టం
28.0/23.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కోర్టు విధులు బహిష్కరించిన అడ్వకేట్లు



వేములవాడ: వేములవాడ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న నక్క దివాకర్‌పై బోయినపల్లి పోలీస్‌స్టేషన్లో అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కోర్టు విధులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై అక్రమ కేసుల నమోదు పరిపాటిగా మారిందన్నారు. విచారణ చేయకుండా న్యాయవాదిపై అక్రమ కేసు నమోదు చేయడం దారుణమన్నారు. వెంటనే అక్రమ కేసును తొలగించాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవదూత రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, విద్యాసాగర్‌రావు, అనిల్‌కుమార్, వంగల కర్ణ, జంగం అంజయ్య, పిల్లి మధు, నాగుల సంపత్, పర్లపెల్లి అంజయ్య, గడ్డం సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోటీలకు ఎంపిక



ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మద్దికుంట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం బాపురెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముస్తాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో నిహారిక, సంజన జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల కమిటీ చైర్మన్ చందన, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫొటోగ్రఫీ వర్క్‌షాప్



సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో సోమవారం ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ జరిగింది. స్వాగత్ కలర్‌ల్యాబ్, ఫ్యూజీ ఫిలిం ఆర్ట్ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులు, నూతన విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఇల్లంతకుంటకు చెందిన మఠం అనిల్, తంగళ్లపల్లికి చెందిన సిలివేరి శ్రీకాంత్ ఇటీవల మరణించారు. ఆ ఇద్దరి కుటుంబాలకు అసోసియేషన్ తరఫున రూ.1.60లక్షల చొప్పున ఆర్థికసాయం అందించారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, రాష్ట్ర సంక్షేమ సంఘం కార్యదర్శి ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సుధగొని సురేష్ గౌడ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సబ్బని ప్రకాశ్, 300 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో సీఎం కప్ క్రీడాపోటీలు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా సీఎం కప్‌లో భాగంగా డిసెంబరు 7, 8 తేదీల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాప్రాధికార సంస్థ సోమవారం తెలిపింది. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ప్రకటించారు. డిసెంబరు 7 నుంచి జనవరి 2 వరకు 36 ఈవెంట్స్‌లో సీఎం కప్–2024 క్రీడోత్సవాలు నిర్వహిస్తామని క్రీడాప్రాధికార సంస్థ తెలిపింది.

ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లకు నూలు సరఫరా

- టెస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల: ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లకు వేములవాడలోని డిపో ద్వారా నూలు సరఫరా చేస్తామని టెస్కో జనరల్ మేనేజర్ వి.అశోక్‌రావు తెలిపారు. సిరిసిల్ల చేనేత, జౌళిశాఖ ఆఫీస్‌లో సోమవారం మ్యాక్స్ సంఘాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. అశోక్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందిస్తామని, ఆ ఆర్డర్లకు సంబంధించి వస్త్రోత్పత్తికి అవసరమైన నూలు సరఫరా చేస్తామని తెలిపారు. మ్యాక్స్ సంఘాల ప్రతినిధులు పలు అనుమానాలు వ్యక్తం చేయగా.. జీఎం అశోక్‌రావు సమాధానాలు ఇచ్చారు. చేనేత, జౌళిశాఖ ఏడీ సాగర్, టెస్కో ఓఎస్‌డీలు హిమజ్‌కుమార్, శ్రీనివాస్, సామల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొందరికే రుణమాఫీ !

- 16,375 మంది రైతుల నిరీక్షణ
- నాలుగో విడతలో 3,357 మందికి రూ.28.72 కోట్లు మాఫీ
- గ్రీవెన్స్‌కు లభించని మోక్షం



వడ్లను తూర్పార పడుతున్న రైతులు

'రాష్ట్రంలో రైతు రుణమాఫీ పూర్తయింది. ఇది చారిత్రాత్మక నిర్ణయం..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రైతుపండుగలో ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో ఇంకా కొందరి రైతుల పంటరుణాలు మాఫీ కాలేదు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తీసుకున్న దరఖాస్తులకు మోక్షం దక్కలేదు. జిల్లాలో నాలుగో విడతలో 3,357 మందికి రూ.28.72కోట్లు మాఫీ చేశారు.



'ఇతను సిరిసిల్లకు చెందిన పాలవ్యాపారి సొదవేణి కనకయ్య. తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ శివారులో 5.12 ఎకరాల భూమి ఉంది. సిరిసిల్ల ఎస్‌బీఐలో ఎకరానికి రూ.35వేల చొప్పున పంట రుణం తనతోపాటు అతని భార్య అంజమ్మ, కొడుకు శ్రీనివాస్ పేరిట రూ.1.70లక్షలు తీసుకున్నాడు. ఏటా పంట రుణాన్ని రెన్యూవల్ చేసుకున్నాడు. కానీ కనకయ్య కుటుంబంలో ఎవరికీ రుణమాఫీ రాలేదు. దీంతో బద్దెనపల్లికి వెళ్లి వ్యవసాయాధికారిని కలిసి గ్రీవెన్స్‌లో దరఖాస్తు ఇచ్చాడు. అయినా నాలుగో విడతలోనూ రుణమాఫీ రాలేదు.



ఇతను బోయినపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన ఎడపల్లి లచ్చయ్య. బోయినపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన లచ్చయ్యకు అతని కుటుంబ సభ్యులకు రైతు రుణమాఫీ రాలేదు. ఒకే రేషన్‌కార్డులో ఇద్దరు కొడుకుల పేర్లు ఉన్నాయని రుణమాఫీ వర్తించలేదు. నిజానికి కొత్తగా రేషన్‌కార్డులు ఇవ్వక ఏళ్లు గడుస్తోంది. కొడుకులకు పెళ్లిళ్లు అయి, పిల్లలు కలిగారు. కానీ అందరి పంటరుణం కలిపితే రూ.2లక్షలు దాటింది. రేషన్‌కార్డు ఒక్కటే ఉన్న కారణంగా రుణమాఫీ వర్తించలేదు.



ఈమె కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన మహిళా రైతు దొడ్డ శంకరవ్వ. స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.83వేలు పంటరుణం తీసుకుంది. కానీ ప్రభుత్వం ప్రకటించిన నాలుగు విడతల్లోనూ రుణమాఫీలో పేరు రాలేదు. లోన్ అకౌంట్‌లో పేరు తప్పు ఉందని చెప్పడంతో బ్యాంకు వెళ్లి సరిచేసుకుంది. వ్యవసాయాధికారులను కలిసి గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసింది. అయినా రుణమాఫీ వర్తించలేదు.



ఇతను ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన తోట బాలయ్య. ఇతనికి నాలుగెకరాల భూమి ఉంది. రూ.1.50లక్షల పంటరుణం తీసుకున్నాడు. వడ్డీ సైతం ఎప్పటికప్పుడు చెల్లిస్తూ పంటరుణాన్ని రెన్యూవల్ చేయించుకున్నాడు. కానీ రుణమాఫీ జాబితాలో పేరు రాలేదు.

రుణమాఫీ ఇలా..

పంటరుణం వివరాలు	రుణమాఫీ పొందిన రైతులు	మాఫీ మొత్తం
మొదటివిడత రూ.లక్షలోపు	23,785	రూ.135.35 కోట్లు
రెండోవిడత రూ.లక్షన్నరలోపు	12,202	రూ.117.76 కోట్లు
మూడోవిడత రూ.2లక్షలలోపు	7,783	రూ.93.04 కోట్లు
నాలుగో విడత	3,357	రూ.28.72 కోట్లు

సిరిసిల్ల: ప్రభుత్వం నాలుగు విడతల్లో రుణమాఫీ పూర్తి చేశామని ప్రకటించగా.. జిల్లాలో మాత్రం ఇప్పటికీ చాలా మంది రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. కుటుంబాలుగా వేరుగా ఉంటున్నా ఒకే రేషన్ కార్డు ఉందని ఒకరికి.. బ్యాంక్ లోన్ ఖాతాలో పేరు తప్పుగా ఉందని మరొకరికి.. కుటుంబ సభ్యులందరి పేరిట కలిపి రూ.2లక్షల్లోపే ఉన్నా జాబితాలో పేరు లేక మరికొందరికీ రుణమాఫీ పూర్తి కాలేదు. ఇలాంటి వారు రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 16,375 మంది రైతులు ఉన్నారు. వ్యవసాయ అధికారులు కానీ.. బ్యాంకు అధికారులు కానీ ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

గ్రీవెన్స్‌కు మోక్షం కరువు

జిల్లా వ్యాప్తంగా రైతుల పంటరుణాల మాఫీ పెండింగ్‌లో ఉండగా.. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో స్వీకరించారు. ఇందులో రేషన్‌కార్డు సమస్యలతో 994 మంది, డేటా సమాచారం లేక 252, రూ.2లక్షలకు పైగా పంటరుణాలు ఉన్నవారు 33, ఆధార్‌నంబర్లు తప్పుగా నమోదు కావడంతో 110, పేర్లు తప్పుగా నమోదు కావడంతో 281, బ్యాంకు సమస్యలతో 78, సింగిల్‌విండోల సమస్యలతో ఇద్దరు, పట్టాదార్ పాస్‌బుక్కు సమస్యలతో 367, ఇతర సమస్యలతో 95 మంది దరఖాస్తు చేశారు. 2,212 మంది నుంచి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. కానీ ఈ దరఖాస్తులకు మోక్షం లభించలేదు. నాలుగో విడత రుణమాఫీ జాబితాలో గ్రీవెన్స్‌లో ఇచ్చిన రైతుల పేర్లు లేకపోవడంతో వారంతా అయోమయానికి గురవుతున్నారు.

పంట రుణాలు ఇలా..

అన్ని రకాల బ్యాంకులు	71
ప్రభుత్వ రంగ బ్యాంకులు	14
ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకులు	23
పంటరుణాల ఖాతాలు	63,502
నాలుగు విడతల్లో రుణమాఫీ ఖాతాలు	47,127
రుణమాఫీ పరిధిలోకి రాని రైతులు	16,375
గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులు	2,212

పూర్తి నివేదిక అందలేదు



రుణమాఫీకి సంబంధించిన పూర్తి నివేదిక అందలేదు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలోని రైతుల పేర్లు కాకుండా ఇంకా ఉన్నట్లు మాకు ఫోన్లు వస్తున్నాయి. రుణమాఫీకి సంబంధించి కొందరు మమ్మల్ని అడుగుతున్నారు. మా వద్ద సమాచారం లేదు. రుణమాఫీ కాకుండా కొన్ని ఖాతాలు ఉన్నాయి. దానిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

– ఎన్.మల్లికార్జున్, ఎల్‌డీఎం

జిల్లా ఆస్పత్రిలో మైత్రి ట్రాన్స్ క్లినిక్

- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మెడికల్ కళాశాలకు 60 డిప్లొమా సీట్లు మంజూరు
- డిప్లొమా ఇన్ అనస్థీషియా, డిప్లొమా ఇన్ ఈసీజీ కోర్సులు
- అదనంగా 14 వైద్యపోస్టులు, మూడు అంబులెన్స్‌లు మంజూరు



మెడికల్ కాలేజీలో వర్చువల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా జనరల్ ఆస్పత్రిలో మైత్రి ట్రాన్స్‌క్లినిక్‌ను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో హైదరాబాద్ నుంచి సోమవారం ప్రారంభించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సిరిసిల్ల మెడికల్ కాలేజీ నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాపాలన–ప్రజావిజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కలు వర్చువల్ విధానంలో మైత్రి ట్రాన్స్‌క్లినిక్‌ను ప్రారంభించారు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలోని మొదటి అంతస్తులో 116 గదిలో ముగ్గురు వైద్యులతో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ అనస్థీషియా కోర్సులకు 30 సీట్లు, డిప్లొమా ఇన్ ఈసీజీ కోర్సులకు మరో 30 సీట్లు మొత్తం 60 సీట్లు మంజూరయ్యాయి. 14 వైద్యపోస్టులు, మూడు అంబులెన్స్‌లను మంజూరు చేసినట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వెల్లడించారు. జిల్లా వైద్యాధికారి ఎం.వసంతరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, డీసీహెచ్‌ఎస్ పెంచలయ్య, జీజీహెచ్ వైద్యులు సంతోష్‌కుమార్, డాక్టర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు వైద్యపరీక్షలు

మైత్రి ట్రాన్స్ క్లినిక్‌లో భాగంగా జిల్లా ఆస్పత్రిలోని 116 గదిలో ట్రాన్స్‌జెండర్లకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా మైత్రి ట్రాన్స్‌క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డాక్టర్ వంశీ, మహిళా సాధికార కో–ఆర్డినేటర్ రోజా, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

డీఈవో బాధ్యతల స్వీకరణ



కోఆర్డినేషన్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లా విద్యాధికారిగా జగన్మోహన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీఈవోగా ఉన్న రమేశ్‌కుమార్‌తో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో ఎంఈవోలతో సమావేశమయ్యారు. అందరూ సమన్వయంతో విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రెగ్యులర్ బోధనతోపాటు విద్యార్థులకు పరిశోధనాత్మక విద్యనందించేలా ముందుకెళ్లాలన్నారు. సైన్స్ ఫెయిర్ నిర్వహణకు సహకరించాలని కోరారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



సిరిసిల్లటౌన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సత్యసాయి సేవా మందిరం ప్రాంగణంలో సోమవారం క్రీడాపోటీలు నిర్వహించారు. సిరిసిల్ల పౌరసంక్షేమ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన పోటీలను అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.రజని ప్రారంభించి మాట్లాడారు. త్రీ వీలర్, ఇన్‌వాలిడ్ డ్రైవింగ్ లైసెన్స్ అర్హత బట్టి పొందవచ్చని తెలిపారు. సిరిసిల్ల పౌరసంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి, కుసుమ గణేష్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆకుల సంధ్య, ఉపాధ్యక్షులు జవాజీ అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి భోగ రాజయ్య, కోశాధికారి ఊరకొండ లత, సహాయ కార్యదర్శి అంబటి శ్రీనివాస్, సత్యసాయి సేవా మందిరం నిర్వాహకులు అన్నల్‌దాస్ రామ్, ఎంబెర్ మమత పాల్గొన్నారు.

ఎగువమానేరు నీటి విడుదలపై సమావేశం

గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు నీటి విడుదలపై మంగళవారం ప్రాజెక్టు అతిథి గృహంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రబీ సీజన్‌కు గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని ఆయకట్టు భూములకు నీరు విడుదల చేయడానికి రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం, ఎన్ని ఎకరాలకు నీరందించాలో రైతులతో చర్చించనున్నారు.

విన్నపాలు వినవలే..

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వివిధ సమస్యలపై 86 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

సిరిసిల్లటౌన్: ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే ప్రభుత్వం ప్రజావాణి నిర్వహిస్తోందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని శాఖలకు కలిపి మొత్తం 86 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో రెవెన్యూ 34, ఉపాధి కల్పన శాఖ 3, ఎంపీడీవో తంగళ్లపల్లి 8, ఎంపీడీవో ముస్తాబాద్ 3, ఎంపీడీవో ఎల్లారెడ్డిపేట 1, ఎంపీడీవో కోనరావుపేట 2, ఎంపీడీవో బోయినపల్లి 2, సిరిసిల్ల మున్సిపల్ 10, డీఎంహెచ్‌వో 5, ఎస్డీసీ 3, విద్యాశాఖ 2, డీఆర్డీవో, డీడబ్ల్యూవో, మార్కెటింగ్, టౌన్‌ప్లానింగ్, ఎస్పీ ఆఫీస్, మైన్స్, పౌరసరఫరాలు, ఆర్‌అండ్‌బీ, ఎంబీ ఇంట్రా, సెస్, డీఎస్ సీడీవో, కార్మికశాఖ, జిల్లా దవాఖాన సిరిసిల్ల కార్యాలయాలకు ఒక్కో దరఖాస్తు వచ్చాయి.

ప్రమాదాలు నివారించాలి



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రెండో బైపాస్ రోడ్డు–చంద్రంపేట సర్కిల్‌లో జంక్షన్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరక్కుండా చర్యలు చేపట్టాలి. సమీపంలోనే వ్యవసాయబావిలో ఇద్దరు పడి మృతిచెందారు. ఇటీవల పెళ్లి బస్సు ప్రమాదవశాత్తు పడిపోయేది డ్రైవర్ అప్రమత్తతతో తప్పించాడు.

– కౌన్సిలర్ పోతూరి రాజిరెడ్డి

పెన్షన్ అందించాలి



మాది మండేపల్లి. నాకు 14 ఏళ్ల వయస్సు. 90 శాతం వైకల్యం ఉంది. సదరం సర్టిఫికెట్ కూడా ఉంది. చాలా కాలం నుంచి దివ్యాంగుల పింఛన్ కోసం తిరుగుతున్నా. గ్రామ పంచాయతీలో కూడా దరఖాస్తు అందించాను. ఇప్పటికీ ఇవ్వడం లేదు. కలెక్టర్ స్పందించి త్వరగా పింఛన్ వచ్చేలా చూడాలి.

– అల్లునూరి శార్వాణి, మండేపల్లి

మెడికల్ కాలేజీలో ఉద్యోగాలివ్వాలి..



కోవిడ్–19 సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్స్‌గా జిల్లాలోని పలు పీహెచ్‌సీల్లో సేవలందించాం. బడ్జెట్ లేనందున ఉద్యోగాల నుంచి తొలగించారు. మెడికల్ కాలేజీలో ల్యాబ్ టెక్నీషియన్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ ఉద్యోగాల్లో మాకు అవకాశం కల్పించాలి. – ల్యాబ్‌టెక్నీషియన్లు, సిరిసిల్ల

మౌనం వీడి ఫిర్యాదు చేయాలి

- మహిళలకు రక్షణగా షీ టీం
- ప్రత్యేక సేవలకు వాట్సాప్ 87126 56425
- ఎస్పీ అఖిల్ మహాజన్



పోకిరీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న షీ టీం సభ్యులు

సిరిసిల్లక్రైం: మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా షీటీం పనిచేస్తోందని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికలు మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సాప్ నంబర్ 87126 56425ను అందుబాటులోకి తెచ్చామని, ఈ నంబర్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఏడాది విద్యార్థినులను వేధిస్తున్న 108 మందిని పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. మహిళలను వేధిస్తున్న వారిపై 44 కేసులు, 60 ఈ–పెట్టి కేసులు నమోదు చేశామన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని కళాశాలల వద్ద 30 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వివరించారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

- మాజీ సర్పంచుల జేఏసీ చైర్మన్ కరుణాకర్



మాట్లాడుతున్న కరుణాకర్

సిరిసిల్లటౌన్: సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని మాజీ సర్పంచుల జేఏసీ చైర్మన్ అక్కెనపల్లి కరుణాకర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకపోతే భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం అంబేడ్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర, శనివారం వంటావార్పు చేపట్టాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గడప శివజ్యోతి, గౌరవ అధ్యక్షులు చాకలి రమేశ్, బొజ్జం మల్లేశం, కోశాధికారి వెన్నమనేని వంశీకృష్ణారావు, కార్యదర్శులు కోల నర్సయ్య, గున్నాల లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి గాండ్ల సుమతి, తాడేపు ఎల్లం, కీర్తిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, పడిగల రవీందర్, కార్యవర్గ సభ్యులు చిట్నేని శ్రీనివాసరావు, మంతెన సంతోష్‌రెడ్డి, రాచూరి రాజేశ్ పాల్గొన్నారు.

110 మందికి ఇద్దరే టీచర్లు

- మరో ఇద్దరిని కేటాయించండి
- కోళ్లమద్ది విద్యార్థులు



కలెక్టరేట్‌కు తరలొచ్చిన కోళ్లమద్ది విద్యార్థులు

సిరిసిల్లటౌన్: ప్రణాళిక ప్రకారం చదువులు కొనసాగాలంటే మరో ఇద్దరు ఉపాధ్యాయులు కావాలని ప్రభుత్వ బడి విద్యార్థులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి వచ్చిన కోళ్లమద్దికి చెందిన విద్యార్థులు మీడియాతో మాట్లాడారు. తమ బడిలో 110 మంది విద్యార్థులం ఉంటే.. ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. గత అక్టోబర్‌లో ఒక టీచర్ పోస్టు కేటాయించినా ఇప్పటి వరకు విధులకు రాలేదని తెలిపారు. ఇప్పటికైనా మరో ఇద్దరు టీచర్లను కేటాయించాలని విద్యార్థులు శ్రీనివాస్, పర్శరాములు, దిలీప్, స్వామి, మహేష్, లింగం తదితరులు కోరారు.

రేపు హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్నకు భక్తులు హుండీలలో వేసిన కట్నాలు, కానుకలను ఈనెల 4న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో చేపట్టే లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఆదేశించారు.

నేడు వేములవాడలో ర్యాలీ

వేములవాడ: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అన్వేశ్ తెలిపారు. తెలంగాణచౌక్ నుంచి రాజన్న ఆలయం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఆస్పత్రిలో మున్సిపల్ సిబ్బందికి వైద్యపరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


యాదగిరి మృతదేహం

వెల్గటూర్ (ధర్మపురి): ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన మామిడిపల్లి యాదగిరి (40) చాలా ఏళ్ల నుంచి తన కుడి కాలుకి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోవడంతో తీవ్రంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో ఆదివారం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

నిప్పంటుకొని వృద్ధురాలు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్‌నగర్‌లో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన వట్టెల మల్లవ్వ ఒంటరిగా ఉంటుంది. ఆదివారం ఉదయం కట్టెలపొయ్యిపై వంట చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలి కొడుకు ఫిర్యాదుతో ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేశారు.

నీటిసంపులో పడి చిన్నారి..


దేవిక మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): నీటి సంపులో పడి ఏడాదిన్నర చిన్నారి మృతిచెందిన ఘటన గంభీరావుపేట మండలం నర్మాలలో సోమవారం జరిగింది. స్థానికుల వివరాలు.. ఉప్పలాయల శ్రీనివాస్–మాధవి కూతురు దేవిక ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ పోయి నీటి సంపులో పడింది. పాప కోసం వెతుకగా నీటి సంపులో కనిపించింది. హుటాహుటిన గంభీరావుపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. చిన్నారి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

సీబీఐ పోలీసులమంటూ సైబర్ వల

చందుర్తి(వేములవాడ): సీబీఐ పోలీసులమంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఆర్‌ఎంపీకి వాట్సాప్ కాల్ చేసి అతడి ఖాతా నుంచి డబ్బు మాయం చేశారు. బాధితుడి వివరాలు.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ అబ్దుల్ కరీంకు సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ కాల్ చేశారు. అతడిపై కేసు నమోదయిందని చెబుతూనే ఖాతా నుంచి రూ.28 వేలు కాజేశారు. కరీం కాల్ కట్ చేయగా డబ్బులు డ్రా అయినట్లు మెస్సేజ్ రావడంతో వెంటనే చందుర్తి పోలీసులను ఆశ్రయించాడు. అలాగే 1930 నబర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

మినీ కాళేశ్వరానికి మోక్షం

- ప్రాజెక్టు పూర్తికి రూ.571 కోట్లు కేటాయింపు
- 45 వేల ఎకరాలకు ప్రయోజనం
- తీరనున్న సాగు.. తాగునీటి కష్టాలు


అసంపూర్తిగా ఉన్న మినీ కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వ

మంథని: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంథని నియోజకవర్గం మహదేవపూర్ మండలం బీరాసాగర్ వద్ద గోదావరిపై నిర్మించతలపెట్టిన చిన్న కాళేశ్వరం (కాళేశ్వర ముక్తీశ్వర ఎత్తి పోతల పథకం) ఇక పరుగులు పెట్టనుంది. పదిరోజుల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన నీటిపారుదల శాఖ సమీక్షలో ప్రాజెక్టు పూర్తికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ.571 కోట్లు కేటాయించారు. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

45 వేల ఎకరాలకు ప్రయోజనం

మంథని నియోజకవర్గంలోని మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాల్లోని 63 గ్రామాల పరిధిలో 45.280 ఎకరాలకు సాగునీరు నీరందించేందుకు 2008 సెప్టెంబర్ 19న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. మహదేవపూర్ మండలం మెట్‌పల్లి పంచాయతీ పరిధి బీరాసాగర్ వద్ద గోదావరినది నుంచి ఎత్తిపోసేలా రూపకల్పన చేశారు. రూ.500 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన అనమతులు వచ్చాయి. తర్వాత ప్రాజెక్టు వ్యయం రూ.946 కోట్లకు చేరింది. ఆయా మండలాల్లోని 14 చెరువులను పునరుద్ధరించి రిజర్వాయర్లుగా మార్చడం, గారెపల్లి సమీపంలో నూతన రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. ఎత్తిపోతల ద్వారా రెండుదశల్లో 4.5 టీఎంసీల గోదావరి నీటిని పంప్‌హౌస్‌ల్లోకి, అక్కడి నుంచి చెరువుల్లోకి మళ్లించేలా ప్రతిపాదించారు. ఈ క్రమంలోనే కాళేశ్వరం సమీపంలోని బీరాసాగర్ వద్ద స్టేజ్–1, కాటారం సమీపంలో గారెపల్లి వద్ద స్టేజ్–2 పంప్‌హౌస్ నిర్మాణాలు జరిగాయి. ఇందులో 27 మెగావాట్ల సామర్థ్యం గల 7 పంపులును బిగించారు. మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

భూ సేకరణతో పనులు పెండింగ్

చిన్న కాళేశ్వరం ఎత్తిపోతలకు సుమారు 3,540 ఎకరాలకు పైగా భూ సేకరణ చేపట్టాలని ప్రతిపాదించారు. ఇందులో 640 ఎకరాలు అటవీ భూమి కాగా మిగతా 2,900 ఎకరాల్లో పట్టా, అసైన్డ్ భూములున్నాయి. అయితే స్టేజ్–1, 2 విభాగాల్లో అటవీ పర్యావరణ అనుమతులకు ఆలస్యమైంది. ఈ క్రమంలో మూడేళ్లకు పైగా పనులు నిలిచిపోయాయి. 2016లో తిరిగి పనులు పునఃప్రారంభించగా స్టేజ్–2కు అటవీ పర్యావరణ అనుమతులు వచ్చాయి. దీంతో అటవీ ప్రాంతంలో పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. మిగతా 2900 ఎకరాలకు గాను అధికారులు కేవలం 1,100 ఎకరాలు మాత్రమే సేకరించారు. మిగతా భూ సేకరణకు అడ్డంకులు తలెత్తాయి. కాగా భూములిచ్చిన రైతులకు సైతం కొంత మేర పరిహారం ఇవ్వాల్సి ఉంది. ఈక్రమంలో మేడిగడ్డ సమీపంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూలంగా చిన్న కాళేశ్వరం ఎత్తిపోతలను టీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని పలుమార్లు శ్రీధర్‌బాబు అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరడంతో మంత్రి శ్రీధర్‌బాబు చిన్న కాళేశ్వరం పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించారు.

టెట్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి తదితరులు

కొత్తపల్లి(కరీంనగర్): వీఎస్‌ఆర్ క్లాసెస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని టీఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో టెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కొత్తపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో టెట్ శిక్షణకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఐఐటీ/నీట్‌లో శిక్షణ ఇస్తున్న మాదిరిగానే టెట్ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అల్ఫోర్స్ ఈ క్లాసెస్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచిత తరగతులు నిర్వహిస్తున్నట్లు, ఇందులో ఇప్పటికే 50 వేల మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నట్లు వివరించారు. 56 కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించి స్టడీ మెటీరియల్ ఉంచినట్లు వెల్లడించారు. తరగతులకు హాజరయ్యే అభ్యర్థులు మంగళ, బుధవారాల్లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందులో ఎంపిక చేసిన వారికి తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకు సహకరించిన కిడ్స్ ట్యూటోరియల్ నిర్వాహకులు సత్యం, టీచర్స్ అకాడమీ నిర్వాహకుడు చందుకు నరేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాలి


కబడ్డీ క్రీడాకారిణులతో సంఘం బాధ్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు సత్తాచాటి విజేతగా నిలవాలని, క్రీడాకారులకు జిల్లా కబడ్డీ సంఘం తరఫున పూర్తి సహకారాలు అందిస్తామని ప్యాట్రన్, పారమిత విద్యా సంస్థల అధినేత డా.ఇ. ప్రసాదరావు, చీఫ్ ప్యాట్రన్ సుధాకర్‌రావు, అధ్యక్షుడు డాక్టర్ చెన్నాడి అమిత్‌రావు అన్నారు. రాష్ట్ర సీనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు సోమవారం సాయంత్రం అంబేద్కర్ స్టేడియం ఆవరణలోని కబడ్డీ కోర్టులో శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. హైదరాబాద్ వేదికగా ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 7 నుంచి 10 వరకు జరిగే పోటీల్లో గెలుపొంది జిల్లా కీర్తిని చాటి చెప్పాలన్నారు. క్రీడాకారుల శిక్షణ కోసం త్వరలోనే రూ.7 లక్షల విలువైన మ్యాట్‌ను అందిస్తామని పేర్కొన్నారు. వారం రోజుల పాటు శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. జిల్లా జట్టుకు కోచ్‌గా పద్మ, మేనేజర్‌గా మోహన్ వ్యవహరిస్తారని సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్.సంపత్‌రావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అనూకర్‌రావు, ప్రధాన కార్యదర్శి బి.మల్లేశ్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుధాకర్, సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులు యూనిస్‌పాషా, వీరన్న, శ్రీనివాస్, రామానందతీర్థ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కుర్చీలు కాల్చి.. నల్లాలు విరిచి


కాలిపోయిన కుర్చీ, నల్లాలు విరిచివేసిన దృశ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తెర్లుమద్ది ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బీభత్సం సృష్టించారు. పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకునే తరగతి గదుల తలుపులను బద్దలుకొట్టారు. గదుల్లోని కుర్చీలను కాల్చివేశారు. చిత్రపటాలను చించివేశారు. లైట్లను ధ్వంసం చేశారు. మూత్రశాలల్లోని నల్లాలను విరిచివేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు విధ్వంసమైన గదులు దర్శనం ఇవ్వడంతో విస్తుపోయారు. ఎవరైన తాగిన మైకంలో ఇలాంటి చర్యలకు పాల్పడ్డారా లేక కావాలనే ప్రభుత్వ పాఠశాలపై దాడులకు తెగబడ్డార అనే విషయం తెలియాల్సి వుంది. పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మహిత ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులను చట్టపరంగా శిక్షించాలని కోరింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

నాలుగు బైక్‌లు దహనం


మంటల్లో కాలుతున్న బైక్‌లు

సిరిసిల్లటౌన్: గుర్తు తెలియని వ్యక్తుల ఘాతుకానికి నాలుగు బైక్‌లు బుగ్గిపాలైన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. సిరిసిల్ల శివారులోని డబుల్‌బెడ్రూం కాలనీలో ఆదివారం అర్ధరాత్రి నాలుగు బైక్‌లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటనలో నాలుగు వాహనాలు పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. కాలనీలోని బ్లాక్ నంబర్ 33వద్ద పార్క్‌చేసిన అంకం సందీప్(హీరో గ్లామర్), ముత్యాల రాజు (హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్), చీరాల ఈశ్వరయ్య (హోండా), మైలారం రామయ్య (టీవీఎస్ ఎక్స్‌ఎల్) వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో వచ్చి విచారణ చేపట్టారు.

చిట్టీల పేరిట మోసం

జమ్మికుంట(హుజూరాబాద్): చిట్టీల పేరిట ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటన జమ్మికుంటలో వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన భూపతి సంతోష్ నుంచి అదే పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిట్టీల పేరిట మాయమాటలు చెప్పి రూ.6లక్షలు కట్టించుకున్నాడు. చిట్టీ గడువు పూర్తయిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసానికి పాల్పడ్డాడు. ఈ విషయమై గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని సంతోష్ ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీస్‌స్టేషన్‌కు పిలిపించినా న్యాయం జరగలేదని, తనలాంటివారు చాలా మంది సదరు ఉపాధ్యాయుడి చేతిలో మోసపోయారని పేర్కొన్నాడు. అనుమతి లేకుండా చిట్టీలు నడుపుతూ అమాయకులను మోసం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని చిట్టాపూర్‌లో ఆదివారం రాత్రి బుక్క రాజేశం ఇంట్లో దొంగలు రూ.10 వేలు చోరీ చేశారు. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. రాజేశం స్థానిక మార్కండేయ స్వామి ఆలయంలో అర్చకుడు. వరంగల్‌లో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో శివకల్యాణం నిర్వహించేందుకు గత నెల 23న ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా వెళ్లాడు. ఈక్రమంలో పూలమొక్కలకు నీరుపోసేందుకు ఇంటిపక్కన ఉండే కొండ వత్తిని రాజేశ్‌కు ఇంటి గేట్ తాళం ఇచ్చాడు. అప్పటి నుంచి రోజూ మాదిరిగానే మొక్కలకు నీరు పోసేందుకు సోమవారం ఉదయం రాజేశం ఇంటికి రాజేశ్ వెళ్లగా ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని గమనించాడు. వెంటనే రాజేశంకు సమాచారం అందించాడు. రాజేశం హుటాహుటిన ఇంటికి వచ్చి చూసే సరికి వస్తువులు, బట్టలు చిందరవందరగా ఉండటంతో పాటు రూ.10వేలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్, క్లూస్ టీం ఘటనాస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


బాధితురాలికి ఫోన్ అప్పగిస్తున్న పోలీసులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గంట వ్యవధిలో కొనుగొని బాధితురాలికి అప్పగించారు పోలీసులు. మానకొండూర్ మండలం వేగురుపల్లెకు చెందిన రేణుక సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌లోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుతున్న తన కూతురును చూసేందుకు సోమవారం వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో తన సెల్‌ఫోన్ ఎక్కడో పోయింది. వెంటనే డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసింది. బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్స్ ఎం.రాకేశ్, కె.హరీశ్ వెంటనే స్పందించారు. మహిళ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను కేవలం గంట వ్యవధిలో కనుగొన్నారు. వెంటనే బాధితురాలికి అందజేసి తమ నిబద్ధత చాటుకున్నారు. ఈసందర్భంగా పోలీసులకు రేణుక కృతజ్ఞతలు తెలిపింది. కాగా గంట వ్యవధిలో ఫోన్ కనుగొని బాధితురాలికి అప్పగించడంతో పోలీసుల సమయస్ఫూర్తిని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

ప్రియుడి ఇంటి ముందు బైఠాయింపు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెళ్లి చేసుకునేందుకు నిరాకరించిన ప్రియుడి ఇంటి ముందు బైఠాయించింది ఓ ప్రియురాలు. స్థానికులు తెలిపిన వివరాలు.. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన జంగిటి అనిల్ ఓ యువతిని ప్రేమిస్తున్నానని వెంటబడి పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా లోబర్చుకున్నాడు. యువతి పెళ్లి మాట ఎత్తగానే ముఖం చాటేయడంతో బాధితురాలు సోమవారం అనిల్ ఇంటిముందు బైఠాయించి నిరసన తెలిపింది. స్థానిక మహిళలు ఆ యువతికి మద్దతు తెలిపారు. యువతికి న్యాయం చేయాలని, వారిద్దరికి పెళ్లి జరిపించాలంటూ డిమాండ్ చేశారు. ఈవిషయమై ఎస్సై వెంకటేశ్‌ను వివరణ కోరగా, తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

రెన్యూవల్ కాక.. పింఛన్ రాక

- దివ్యాంగుడి ఇబ్బందులు


సదరం సర్టిఫికెట్ చూపుతున్న రాజు

కోనరావుపేట(వేములవాడ): పది నెలలుగా పింఛన్ రాక ఓ దివ్యాంగుడు ఇబ్బందులు ప డుతున్నాడు. అధికారులు, కా ర్యాలయాల చుట్టూ అవస్థలు పడుతూ తిరుగుతున్నాడు. బాధితుడు తెలి పిన వివరాలు.. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన లింగంపెల్లి రాజుకు రెండు కాళ్లు సరిగా పనిచేయకపోవడంతో నడవలేడు. ఫి బ్రవరి 2022లో సదరం శిబిరానికి వెళ్లగా 50 శా తం వైకల్యం ఉన్నట్లు అధికారులు సర్టిఫికెట్ జారీ చేశారు. కొద్దినెలలు సక్రమంగా వచ్చిన పింఛన్ ఫిబ్రవరి 2024 నుంచి నిలిచిపోయింది. అధి కారుల వద్దకు వెళ్లగా సదరం సర్టిఫికెట్ గడువు తేదీ ముగిసిందని, రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ సెంటర్‌కు వెళ్లగా ఆన్‌లైన్‌లో తీసుకోవడం లేదు. సర్టి ఫికెట్ ఉన్నట్లు చూపిస్తోంది. అధికారుల వద్ద కు వెళ్లగా మళ్లీ రెన్యూవల్ చేసుకోవాలని చెబు తున్నారు. అటు సర్టి ఫికెట్ రెన్యూవల్ కాక, కొత్తగా దరఖాస్తు తీసుకోక, పింఛన్ రాకపోవడంతో రాజు ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు పింఛన్ వచ్చేలా చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

రుణం కోసం పోరాటం

- ప్రధానమంత్రికి ఫిర్యాదు చేసిన వృద్ధ రైతు
- సదరు ప్రతితో కలెక్టరేట్‌లో వేడుకోలు


రాంరెడ్డి

కరీంనగర్‌అర్బన్: రుణం కోసం పోరాటం చేస్తున్నాడు ఈ వృద్ధ రైతు. మామూలుగా మండలం, డివిజన్, జిల్లా కార్యాలయాలు, చివరగా రాష్ట్ర ప్రభుత్వం వరకు ఫిర్యాదు చేయడం సహజం. కానీ ఈ రైతు మాత్రం అలుపెరగని పోరాటం చేస్తున్నాడు. ఏకంగా బ్యాంకు రుణం ఇవ్వడం లేదంటూ ప్రధానమంత్రికి ఫిర్యాదు చేశాడు. ఏడు పదుల వయసులోనూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చిగురుమామిడి మండలం ఒగులాపురం గ్రామానికి చెందిన గడ్డం రాంరెడ్డి యూనియన్ బ్యాంకులో రూ.1.50లక్షలు పంట రుణం తీసుకున్నాడు. 2018లో రుణం తీసుకోగా ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మూడో విడతలో మాఫీ అయింది. ఈ క్రమంలో మళ్లీ రుణం కోసం వెళ్తే రుణం ఇవ్వమని చెబుతున్నారని వాపోయాడు. దీంతో మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశాడు. 1965 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన రాంరెడ్డికి కార్యాలయాలపై పట్టుండగా ఏకంగా ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. సదరు ప్రతితో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిని ఆశ్రయించారు.

భూవివాదంలో అన్నపై తమ్ముడి దాడి

చందుర్తి(వేములవాడ): భూ వివాదంలో అన్నపై తమ్ముడు దాడి చేసిన ఘటన చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేటకు చెందిన పిట్టల శంకర్, అతడి తమ్ముడు పిట్టల లక్ష్మణ్‌కు పొలం వద్ద దారి విషయంలో కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మళ్లీ గొడవ జరగడంతో శంకర్‌పై తమ్ముడు లక్ష్మణ్ దాడి చేయగా అతడి తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. శంకర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో శంకరయ్య తెలిపారు.

అల్మాస్‌పూర్‌లో రెండిళ్లలో చోరీ


ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో సోమవారం దొంగలు పడ్డారు. గ్రామానికి చెందిన లిక్కిడి పద్మ తన తల్లిగారి గ్రామం కంచర్లకు ఆదివారం వెళ్లింది. సోమవారం ఉదయం తిరిగొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో లోనికి వెళ్లి పరిశీలించగా బీరువాలో దాచిన రూ.15వేలు ఎత్తుకెళ్లారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన ఉచ్చిడి కిషన్‌రెడ్డి ఇంటి తాళం పగులగొట్టి ల్యాప్‌టాప్, ట్యాబ్, గడియారాలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అందని పరిహారం

- ఎదురుచూపులే మిగులుతున్నాయ్
- ఏడాదిలో 25 సంఘటనల్లో 25 జీవాల మృతి
- పోస్టుమార్టంతోనే సరిపెడుతున్న అధికారులు
- వరుసదాడులతో వణుకుతున్న రైతులు
- జిల్లాలో పది చిరుతల సంచారం


ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన జంగ అశోక్. గ్రామ శివారులో పశువులపాకలో కట్టేసిన లేగ దూడపై చిరుతపులి దాడి చేసింది. అధికారులు పోస్టుమార్టం చేసి నివేదిక ప్రభుత్వానికి అందించారు. పరిహారం కోసం నాలుగుసార్లు అటవీశాఖ కార్యాలయాల చుట్టూ తిరిగాడు. అయిన పరిహారం అందలేదు.




చిరుత సంచరించిన ఆనవాళ్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో చిరుతల దాడిలో పశువులు మృతిచెందిన బాధిత రైతులకు పరిహారం అందడం లేదు. ఏళ్లుగా ఎదురుచూపులే దిక్కవుతున్నాయి. చిరుతల దాడులతో లేగదూడలు, ఆవులు, మేకలు, గొర్రెలు మరణిస్తున్నాయి. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, కోనరావుపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో ఆరునెలల కాలంలో జరిగిన 25 సంఘటనల్లో 25 జీవాల ప్రాణాలు కోల్పోయాయి. అటవీశాఖ, పశువైద్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తున్నారే తప్ప పరిహారం మాత్రం అందడం లేదు.

వరుస దాడులతో ఆందోళన

జిల్లాలోని ఇల్లంతకుంట, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, వీర్నపల్లి మండలాల్లో ప్రధానంగా చిరుతలు వరుస దాడులు చేస్తున్నాయి. ఆరు నెలల కాలంలో ఇల్లంతకుంటలోని చిట్టాపూర్, వల్లంపట్ల, ఒబులాపూర్, వెల్జీపూర్, అనంతారం, పెద్దలింగాపూర్, రంగంపేట, లక్ష్మీపూర్, కోనరావుపేట, గుంటపల్లిచెరువుతండాల్లో 25 లేగదూడలపై దాడి చేసి హతమార్చాయి. వీర్నపల్లి మండలం మద్దిమల్ల, కంచర్ల, రంగంపేట, ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి, వెంకటాపూర్, కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్, మల్కపేట, ధర్మారం గ్రామాల్లో లేగదూడలను హతమార్చాయి. మద్దిమల్ల, అక్కపల్లిల్లో గొర్రెలమందపై దాడి చేసి ఆరు జీవాల ప్రాణాలు తీశాయి. చిరుతల సంచారంతో రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

10 చిరుతలు..25 సంఘటనలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నాలుగు పెద్దవి, మూడు పిల్ల చిరుతలు సంచరిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఒక్క రోజులో 50 కిలోమీటర్ల వరకు వేగంగా సంచరించే చిరుతలు అనుకూలంగా ఉన్న ప్రాంతాలపై దాడులు చేస్తూ జీవాలను ఆహారంగా తీసుకుంటున్నాయి. చిరుతల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారే తప్పా.. వాటిని కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు. నష్టపోయిన బాధితుల వేదనలు వినే అధికారులు కరువయ్యారు. అధికారులు మాత్రం అటవీ శాఖ నుంచి మాత్రమే పరిహారం అందుతుందని, ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం వచ్చే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో జరిగిన సంఘటనలకు అసలు పరిహారమే రాదని చెబుతున్నారు. కేవలం ఎలుగుబంట్ల దాడిలో గాయపడ్డ, ప్రాణాలు కోల్పోయిన వారికి మాత్రమే ప్రభుత్వపరంగా పరిహారం అందుతుందంటున్నారు.

రిజర్వు ఫారెస్టు సంఘటనలకు పరిహారం రాదు



అనుమతులు లేకుండా రిజర్వు ఫారెస్టులను చదును చేసి అక్కడ వ్యవసాయం చేస్తూ లేగదూడలను కట్టివేస్తే వారికి ప్రభుత్వపరంగా పరిహారం రాదు. కొంత మంది అనుమతులు లేని ప్రాంతాలకు వెళ్లి పశువులు, గొర్రెలను మేపుతున్నారు. ఆ సమయంలో జరిగే దాడులకు పరిహారం అందించలేం. ఏడాది క్రితం జరిగిన కొన్ని సంఘటనల్లో రైతులకు పరిహారం వచ్చింది. ఎలుగుబంట్ల దాడిలో గాయపడ్డ వారికి రూ.25వేల చొప్పున అందించాం.

– నునావత్ మోహన్‌లాల్, డిప్యూటీ సెక్షన్ అధికారి, ఎల్లారెడ్డిపేట